
సాక్షి ఒడిశా

మంగళవారం । 8 । అక్టోబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,82,986లు, బంగారం 14 గ్రాములు వెండి 26 గ్రాముల 100 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



వాలీబాల్ పోటీలు ప్రారంభం

పర్లాకిమిడి గజపతి స్టేడియంలో 68వ రాష్ట్రస్థాయి విద్యాలయాల అండర్-14, 17 వాలీబాల్ పోటీలు ప్రారంభమయ్యాయి.

-10లో



విస్తృతంగా ఎక్సైజ్ దాడులు


రాయగడ జిల్లాలో ఎక్సైజ్ శాఖ సోమవారం విస్తృతంగా దాడులు నిర్వహించింది.

-10లో

మనసు దోచే... మల్కన్‌గిరి..!



సత్తిగడ జలాశయంలో చేపలు పడుతున్న గిరిజనులు



అందమైన ఘాట్ రోడ్డు



మల్కన్‌గిరి జిల్లా రాష్ట్రంలోనే అందాలకు నెలవైన ప్రాంతం. అధిక శాతం గిరిజనులు నివసించే ఈ ప్రాంతంలో ప్రకృతి అందాలు మనసును దోచుకుంటాయి. మంచుతో కూడిన కొండలు, అందమైన జలాశయాలు మనల్ని కట్టిపడేస్తాయి. వాటిని సాక్షి క్లిక్‌మనిపించింది.

– మల్కన్‌గిరి



గురుప్రియ వంతెన



అందమైన పచ్చిక బయళ్లు



మంచుతో నిండిన కొండలు



చిత్రకొండ జలాశయంలో లాంచీ ప్రయాణం

రఘునాథ్ సేవలు చిరస్మరణీయం



రఘునాథ్ పట్నాయిక్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే బాహిణీపతి

జయపురం: రాష్ట్ర న్యాయ, ఆర్థిక, పంచాయతీ శాఖల మంత్రిగా దివంగత రఘునాథ్ పట్నాయక్ రాష్ట్ర ప్రజలకు అందించిన సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. సోమవారం జయపురం పవర్ హౌస్ కూడలి వద్ద ఆయన విగ్రహాన్ని ఒడిశా విద్యాలయ, గణశిక్ష, ఎస్టీ, ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి నిత్యానంద గోండ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రఘునాథ్ పట్నాయిక్ ప్రజల మనిషి అని కొనియాడారు. జయపురం నుంచి 6 సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై అవిభక్త కొరాపుట్ జిల్లా అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో కొరాపుట్ ఎంపీ సప్తగిరి శంకర ఉల్క, జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి, పొట్టంగి ఎమ్మెల్యే రామచంద్ర కడమ్, కొరాపుట్ ఎమ్మెల్యే రఘురామ్ మచ్చ, లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పవిత్ర సాంత, కోట్‌పాడ్ ఎమ్మెల్యే రూపు బొత్ర, నవరంగపూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర మఝి, ఉత్కళ సమ్మిళిణి అధ్యక్షుడు అద్వైత్ కుమార్ పాత్రో, కొరాపుట్ కలెక్టర్ వి.కీర్తి వాసన్, జయపురం సబ్ కలెక్టర్ అక్కవరం శౌశ్య రెడ్డి, మున్సిపల్ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

క్రికెట్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ వేద్బార్ ప్రధాన్

మల్కన్‌గిరి: జిల్లాలోని మల్కన్‌గిరి సమితి ఎంవీ 7 గ్రామంలో ఉన్న హైస్కూల్ క్రీడా మైదానంలో ఎ.ఈశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను జిల్లా అదనపు కలెక్టర్ వేద్బార్ ప్రధాన్ సోమవారం ప్రారంభించారు. ఈ పోటీల్లో కలిమెల, మత్తిలి, కోరుకొండ, ఖోయిర్‌పూట్, మల్కన్‌గిరి, చిత్రకొండ, పోడియా సమితుల నుంచి 11 జట్లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడలపై దృష్టి సారించి, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మల్కన్‌గిరి సమితి అధికారి ప్రభాతి జోడియా, జిల్లా క్రీడా అధికారి మాధవ్ పంగి తదితరులు పాల్గొన్నారు.

‘ఎన్నికల హామీలు అమలు చేయాలి’



జన సంపర్క్ యాత్రలో పాల్గొన్న బీజేడీ శ్రేణులు

జయపురం: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను బీజేపీ ప్రభుత్వం అమలు చేయాలని మాజీ మంత్రి రబినారాయణ నందో డిమాండ్ చేశారు. సోమవారం జయపురం సమితి ఘాట్‌భగర గ్రామంలో నిర్వహించిన జన సంపర్క్ పాదయాత్ర సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలకు పలు హామీలు ఇచ్చి అధికార పీఠమెక్కిన బీజేపీ, అనంతరం వాటిని తుంగలో తొక్కిందని ధ్వజమెత్తారు. 100 రోజుల బీజేపీ పాలనలో అభివృద్ధి పనులు మూలనపడ్డాయని ఎద్దేవా చేశారు. ప్రజలను మోసం చేస్తున్న బీజేపీ ప్రభుత్వ బండారాన్ని ఎండగట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. నేతలంతా విభేదాలు వీడి సమైక్యంగా బీజేపీ ప్రజా వ్యతిరేక పాలనపై పోరాడాలని కోరారు. సభానంతరం ఘాట్‌భగర గ్రామం నుంచి పాదయాత్ర ప్రారంభమై మాలిదొలాయిపుట్ గ్రామం వరకు కొనసాగింది. కార్యక్రమంలో జిల్లా బీజేడీ అధ్యక్షుడు, మాజీ ఎంపీ జిన్నా హికాక, సీనియర్ నేత అనూప్ కుమార్ పాత్రో, దుర్గ మిశ్ర, బాలారాయ్, మాజీ ఎమ్మెల్యే ప్రఫుల్ల పంగి, ఎంపీ ప్రతినిధి కౌశల్య హికాక, పార్వతీ మిస్త్రీ, బినోద పాత్రో, సమితి మాజీ ఉపాధ్యక్షులు ఈశ్వర బాగ్, తొపతి పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కనీస పెన్షన్ రూ.9 వేలు చేయాలి



సమావేశంలో పాల్గొన్న సంఘం నేతలు

జయపురం: ఈపీఎఫ్ పెన్షన్‌దారులకు కనీస పెన్షన్ రూ.9 వేలు చేయాలని ఈపీఎఫ్ పెన్షన్‌దారుల అసోసియేషన్ డిమాండ్ చేసింది. స్థానిక యాదవ భవనంలో కొరాపుట్ జిల్లా ఈపీఎఫ్ పెన్షన్‌దారుల అసోసియేషన్ సమావేశం సోమవారం జరిగింది. అసోసియేషన్ అధ్యక్షుడు నళినీ కాంత రథ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సాధారణ కార్యదర్శి ప్రదీప్ కుమార్ మహంతి మాట్లాడుతూ.. ఎంతోకాలంగా పెన్షన్‌దారుల డిమాండ్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విన్నవించుకుంటున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. డిమాండ్ల సాధన కోసం నవంబర్ 3, 4 తేదీల్లో పూరీలో అఖిల ఒడిశా రాష్ట్ర ఈపీఎఫ్ పెన్షనర్ల అసోసియేషన్ సమావేశం జరుగుతుందని వెల్లడించారు. సమావేశంలో అసోసియేషన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఉమారథ్, పేపర్ మిల్లు కార్మిక నేత బసంత బెహర, ఇరిగేషన్ విభాగ కార్మిక నేత కిశోర్ పండ తదితరులు పాల్గొన్నారు.

తొలొరంభలో అతిసారం

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి నారాయణపూర్ పంచాయతీ పరిధి తొలొరంభ గ్రామంలో అతిసారం వ్యాపించింది. గత వారం రోజుల్లో ఈ వ్యాధితో ఎనిమిది మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గ్రామానికి చెందిన దాసిని కునక, గవురు కునక, రస్మీ తియాక, మంగిలి మండిక, బామి కునక, గొలాయి కద్రకల పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో వీరందరినీ కల్యాణ సింగుపూర్ పీహెచ్‌సీకి చికిత్స కోసం గ్రామస్తులు తరలించారు. సమాచారం తెలుసుకున్న ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. వ్యాధి లక్షణాలు, రక్త నమూనాలను సేకరించేందుకు ఇద్దరు ఆరోగ్య కార్యకర్తలను గ్రామానికి పంపించారు. గ్రామంలో ఇప్పటికీ కొంతమంది అతిసారంతో బాధపడుతున్నట్లు గుర్తించిన ఆరోగ్య కార్యకర్తలు వారికి అవసరమైన మందులను పంపిణీ చేశారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి అందరి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుంటున్నారు. కొంతమంది రక్త నమూనాలను సేకరించి జిల్లా కేంద్రాస్పత్రికి తరలించినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారులు చెబుతున్నారు. అయితే పరిస్థితి అదుపులోనే ఉందని, ప్రస్తుతం పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితి మెరుగుపడిందని సమాచారం.



చికిత్స పొందుతున్న గౌరు కునక



చికిత్స పొందుతున్న కునక దాసిని



గ్రామంలో అతిసారంతో బాధపడుతున్న మహిళలు

కలుషిత నీరే కారణం

ఈ గ్రామంలో 23 కుటుంబాలు నివసిస్తున్నాయి. వీరంతా ఆదివాసీలే కావడంతో వ్యాధి సంక్రమించినప్పటికీ నాటువైద్యంపైనే ఆధారపడుతున్నారు. వ్యాధి తీవ్రరూపం దాల్చడంతో పరిస్థితి చేయిజారిపోతుందని భావించి అధికారులు పీహెచ్‌సీకి తరలించారు. ఇదిలా ఉండగా గ్రామంలో ఉన్న ఒకే ఒక్క గొట్టపు బావిపై గ్రామస్తులు ఆధారపడుతున్నారు. కాగా ఆ బావి నుంచి కూడా బురద నీరు వస్తుండడంతో గత్యంతరం లేక వాటినే తాగేందుకు వినియోగిస్తున్నారు. దీంతో వ్యాధి బారిన పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

న్యూస్‌రీల్

బీజేడీ పాలనలో వ్యవసాయ రంగం కుదేలైంది

● రాష్ట్ర కృషక్ మోర్చ ఉపాధ్యక్షుడు బిపద రంజన్ దాస్



మాట్లాడుతున్న బిపద రంజన్ దాస్

జయపురం: రెండు దశాబ్దాలకు పైగా బీజేడీ పాలనలో రాష్ట్రంలో వ్యవసాయ రంగం కుదేలైందని రాష్ట్ర కృషక్ మోర్చ ఉపాధ్యక్షుడు బిపద రంజన్ దాస్ ఆరోపించారు. జయపురం సమితి అంబాగుడలో కృషక్ మోర్చ సమావేశాన్ని రాష్ట్ర కృషక్ మోర్చా అధ్యక్షుడు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బిపద రంజన్ దాస్ మాట్లాడుతూ.. బీజేడీ పాలనలో వ్యవసాయ రంగం అవినీతి, అక్రమాలకు నిలయమైందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు బీజేపీ సర్కార్ చర్యలు చేపట్టిందని, పంట భూములన్నింటికీ సాగునీరు అందజేస్తోందన్నారు. సాగునీటి వనరులు లేని ప్రాంతాల్లో ఎత్తిపోతల పథకాలు అమలు చేస్తుందని వెల్లడించారు. మండీల్లో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసే సమయంలో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రుల ఫొటోలు పెట్టాలని ఆయన సూచించారు. క్వింటాల్ ధాన్యం ధరను రూ.3,100కు ప్రభుత్వం పెంచిందని గుర్తు చేశారు. ఈ సమాచారం ప్రతీ రైతుకు తెలియజేయాలన్నారు. సమావేశంలో కొరాపుట్ జిల్లా కిసాన్ మోర్చ అధ్యక్షుడు భగవాన్ ముదులి, కొరాపుట్ ఎమ్మెల్యే రఘునాథ్ మచ్చ, రాష్ట్ర బీజేపీ శాశ్వత కార్యవర్గ సభ్యుడు గౌతమ సామంత రాయ్ తదితరులు పాల్గొన్నారు.

అరుణ్ షోడంగి వాలంటరీ రిటైర్‌మెంట్

మల్కన్‌గిరి: సీనియర్ ఐపీఎస్ అధికారి అరుణ్ షోడంగి స్వచ్ఛందంగా పదవీ విరమణ పొందేందుకు ఒడిశా ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఆయనను ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఒడిశా పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్‌గా నియమించింది. దీంతో ఆయన కొత్త బాధ్యతలు స్వీకరించేందుకు వీలుగా రిటైర్‌మెంట్ తీసుకున్నారు. ఈయన 1990 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి.


వన్య ప్రాణుల సంరక్షణపై అవగాహన



అటవీ శాఖ ఉన్నతాధికారులతో ఎంపీ సప్తగిరి

కొరాపుట్: జిల్లా కేంద్రంలో వన్య ప్రాణుల సంరక్షణపై అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్క మాట్లాడుతూ తరిగిపోతున్న అడవుల వలన వన్య ప్రాణుల జీవనం ప్రశ్నార్థకంగా మారిందన్నారు. మొక్కలు పెంచడాన్ని ప్రజలు సామాజిక బాధ్యతగా స్వీకరించాలని పిలుపునిచ్చారు. అనంతరం అడవుల సంరక్షణ కోసం కృషి చేస్తున్న పలువురు సామాజిక కార్యకర్తలను సత్కరించారు.

దసరా సమయంలో బంద్ సరికాదు



జయపురం: దసరా పండగ సమయంలో ప్రైవేట్ బస్సుల బంద్ ప్రకటన సరికాదని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి అభిప్రాయపడ్డారు. పట్టణంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. పండగల సమయంలో బంద్ జరిపితే ప్రజలు ఇబ్బందులు పడతారన్నారు. దసరా తర్వాత చర్చించుకొని తగు నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రైవేట్ బస్సులు ఏఏ రూట్లలో తిరగడం లేదో ఆయా రూట్లలో లక్ష్మీ బస్సులు నడపాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు తెలిపారు. దీనికి ప్రైవేట్ బస్సు యజమానులు వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. బంద్‌పై పునరాలోచన చేయాలని కోరారు.

క్లుప్తంగా

బ్రహ్మోత్సవాల్లో హారికా సునీత్ బృందం



రాధాకృష్ణ గోపికల వేషధారణలో బృందం

నరసన్నపేట: తిరుమలలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి వారు కల్పవృక్ష వాహనంపై ఊరేగగా.. నరసన్నపేటకు చెందిన హారికా సునీత్ బృందం నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకుంది. మారుతీనగర్‌కు చెందిన 25 మంది సభ్యులు కోలాట ప్రదర్శన చేశారు.

జిల్లా పంచాయతీ అధికారిగా భారతీ సౌజన్య



భారతీ సౌజన్య

అరసవల్లి: జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ)గా కె.భారతీ సౌజన్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఏఓ కోటేశ్వరరావు తదితర విభాగాల సహాయకులతో చర్చించారు. అనంతరం జెడ్పీలో జరిగిన గ్రీవెన్స్‌లో పాల్గొని కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

కుంటిభద్ర ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

కొత్తూరు: మండలంలోని కుంటిభద్ర ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ ఏ.జగదీశ్వరరావును విధుల నుంచి సస్పెండ్ చేస్తూ డ్వామా పీడీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సోమవారం మండల పరిషత్ కార్యాలయానికి ఉత్తర్వులు చేరాయి.

సీఐలకు స్థానచలనం

శ్రీకాకుళం క్రైమ్ : విశాఖ రేంజి పరిధిలో ఇద్దరు సీఐలను జిల్లాకు బదిలీ చేస్తున్నట్లు డీఐజీ కార్యాలయం నుంచి సోమవారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. వీరిలో ఎం.తిరుపతిరావు (కాశీబుగ్గ రూరల్ సర్కిల్), టి.త్రినేత్రి (శ్రీకాకుళం మహిళా పోలీస్ స్టేషన్)లు ఉన్నారు. కాగా కాశీబుగ్గ రూరల్ సర్కిల్‌లో పనిచేసిన పి.ఈశ్వరరావు విశాఖ వీఆర్‌కు వెళ్లనున్నారు.

అండర్-14 బాలుర క్రికెట్ జట్టు ఖరారు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా అండర్-14 బాలుర క్రికెట్ జట్టు ఖరారైంది. 2024-25 సీజన్‌కుగాను ఇటీవల జరిగిన ఎంపికల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు సెలక్షన్ మ్యాచ్‌లు నిర్వహించిన తర్వాత 16 మందితో కూడిన తుది జాబితాను జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష,కార్యదర్శులు పుల్లెల శాస్త్రి, హసన్‌రాజా, మెంటార్ ఇలియాస్ మహ్మద్ సోమవారం వెల్లడించారు. ఈ నెల 10 నుంచి 23 వరకు గుంటూరు వేదికగా జరగనున్న ఏసీఏ అంతర్ జిల్లాల అండర్-14 క్రికెట్ టోర్నమెంట్‌లో జిల్లా జట్టు పాల్గొంటుందని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులంతా ఈ నెల 8న విశాఖ రైల్వేస్టేషన్ వద్ద రిపోర్ట్ చేయాలన్నారు. జట్టుకు కోచ్ మేనేజర్లుగా శ్రీనివాస్, కిరణ్‌లు వ్యవహరిస్తారని తెలిపారు.

జిల్లా అండర్-14 జట్టు ఇదే..

ఎస్.వివేకానంద (కెప్టెన్), ఎ.నేత్రకిరణ్, వి.కృష్ణకౌషన్, ఎన్.జోగేంద్ర, ఎం.పవన్‌కుమార్, ఎస్.వెంకట్‌ప్రేరణ్, జె.హర్షవర్ధన్, శ్రీయోజిత్, ఎస్.రుత్విక్, జీఎస్‌వీ సూర్య, కోండ్రు జోషిత్, షరీఫ్ హక్, సాయి ఆదిత్య, కె.గౌతమ్, టి.జోష్మత్, పి.మోక్షిత్‌శ్రీనిత్య్. స్టాండ్‌బైగా ఆర్.షయిల్‌కుమార్, పి.మెహర్‌తేజ, ఎంఎస్ జాన్ వెస్లీ, మనోజ్‌శ్రీసాయి ఉన్నారు.

మెట్‌కోర్ లావాదేవీలపై బహిరంగ విచారణ చేయాలి

టెక్కలి : మండలంలోని రావివలస మెట్‌కోర్ ఫెర్రో ఎల్లాయ్స్ పరిశ్రమకు సంబంధించి యాజమాన్యాల మార్పుపై బహిరంగ విచారణ చేసి కార్మికులను ఆదుకోవాలని కార్మిక సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఐటీయూ నాయకుడు ఎన్.షణ్ముఖరావుతో కలిసి సోమవారం కార్మిక శాఖాధికారి ఆర్.రాధాకుమారిని కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తరచూ యాజమాన్యాలు మారుతూ కార్మికులకు పూర్తి స్థాయిలో వేతనాలు, ఇతర అలవెన్సులు అందజేయడం లేదన్నారు. తక్షణమే కలెక్టర్ అధ్యక్షతన బహిరంగ విచారణ చేసి తమను ఆదుకోవాలని కార్మికులు పీఎండీ బోసు, కె.భుజంగరావు, పి.సీతారాం తదితరులు కోరారు.

పసిపిల్లలకు అత్యుత్తమ వైద్యసేవలు



యూనిట్‌ను ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ దాసరి షకీలా

శ్రీకాకుళం: మాతా నియోనాటల్ కేర్(ఎం.ఎన్.సీ.యూ) ద్వారా గర్భిణులకు, పసిపిల్లలకు అత్యుత్తమ వైద్య సేవలు అందించడమే లక్ష్యమని శ్రీకాకుళంలోని జనరల్ గవర్నమెంట్ హాస్పిటల్(జీజీహెచ్)సూపరింటెండెంట్ డాక్టర్ దాసరి షకీలా అన్నారు. ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఎంఎన్‌సీయూను సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

పర్లాకిమిడి: స్థానిక గజపతి స్టేడియంలో 68వ రాష్ట్రస్థాయి విద్యాలయాల అండర్-14, 17 వాలీబాల్ పోటీలను కలెక్టర్ బిజయ కుమార్ దాస్ సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ పోటీల్లో భువనేశ్వర్ జట్టుతో సహా 30 జిల్లాల నుంచి 31 జట్లు, 814 క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలు ఈనెల 9వ తేదీ వరకు జరుగుతాయని వెల్లడించారు.

ప్రతిరోజూ స్టేడియంలో ఉత్సాహం కోసం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ గవర తిరుపతిరావు, పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెఠి, ఎంపీ ప్రతినిధి దారపు రాజేష్, జిల్లా క్రీడాధికారి ప్రాణకృష్ణ పాణిగ్రాహి, జిల్లా అదనపు ముఖ్యశిక్షాధికారి మనోరంజన్ దొళాయి, జిల్లా విద్యాలయాల క్రీడాధికారి సురేంద్ర కుమార్ పాత్రో, జిల్లా సైన్స్ కో-ఆర్డినేటర్ ఎ.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన క్రీడాకారులు



తలపడుతున్న ఢెంకనాల్, మల్కన్‌గిరి జట్లు



హోరాహోరీగా సాగుతున్న మల్కన్‌గిరి, గంజాం జట్ల మధ్య మ్యాచ్

చండీరూపంలో అమ్మవారు



రాయగడ: యాపిల్ పండ్లు, పువ్వులతో అమ్మవారి సన్నిధిని అలంకరించిన దృశ్యం



రాయగడ: చండీరూపంలో అమ్మవారు



కొరాపుట్: బండారు ఘరణి శక్తి పీఠంలో కంకణాలు ధరిస్తున్న భక్తులు



రాయగడ: వెలుగుతున్న అఖండ జ్యోతులు

రాయగడ: స్థానిక గుండిచా మందిరం సమీపంలోని వినాయక ఆలయంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రుల్లో భాగంగా సోమవారం చండీరూపంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని చండీరూపంలో అలంకరించి సహస్రనామాల జపాలు, లలిత పారాయణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. అలాగే మజ్జిగౌరి మందిరంలో ఈ శరన్నవరాత్రులను పురస్కరించుకుని అమ్మవారికి వివిధ అలంకరణలు చేస్తున్నారు. దీనిలో భాగంగా అమ్మవారి సన్నిధిని యాపిల్ పండ్లతో, పువ్వులతో అలంకరించారు. ఇదిలా ఉండగా మందిరం ప్రాంగణంలో దేదీప్యమానంగా అఖండ జ్యోతులు వెలుగుతున్నాయి. అదేవిధంగా గ్రామ దేవత బురదల పోలమ్మ అమ్మవారి మందిరం విద్యుత్ కాంతులతో మెరిసిపోతుంది.

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లాలో ఏకైక శక్తిపీఠం బండారు ఘరణి శక్తిపీఠానికి నవరాత్రుల సోమవారం సందర్భంగా భక్తులు పోటెత్తారు. ఉద్యోగాల నిమిత్తం సుదూర ప్రాంతాలకు తరలివెళ్లిన వారు స్వస్థలాలకు వచ్చి అమ్మవారికి మొక్కుబడులు చెల్లిస్తున్నారు.



రాయగడ: బురదల పోలమ్మ మందిరం విద్యుత్ కాంతులతో మెరుస్తున్న దృశ్యం



రాయగడ: రావి చెట్టు వద్ద పూజలు చేస్తున్న మహిళలు

ఇంటి పంటలపై శిక్షణ శిబిరం



శిక్షణలో పాల్గొన్న ప్రజలు



ఇంటి పంటలపై శిక్షణ ఇస్తున్న డాక్టర్ శ్రీనివాస్

జయపురం: ఇంటి పైకప్పు మీద (రూఫ్ టాప్ గార్డెన్) పంటలు పండించే విధానంపై స్థానిక పూల్‌బెడలోని ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ కేంద్రంలో భువనేశ్వర్ సెంట్రల్ హార్టీ కల్చరల్ ఎక్స్‌పెర్మెంట్ స్టేషన్ సభ్యులు శిక్షణ శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సెంట్రల్ హార్టీ కల్చర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసన్ మాట్లాడుతూ.. ఎటువంటి రసాయనిక ఎరువులు లేకుండా ఇంటి పైకప్పుపై కాయకూరలు పండించే విధానాన్ని వివరించారు. ముఖ్యంగా సుగంధ ద్రవ్యాలు, సేంద్రీయ ఎరువులు వినియోగించి పంటలు పండించే విధానాన్ని ప్రాక్టికల్‌గా చూపించారు. ఇటువంటి పంటల వలన ఆరోగ్యకరమైన కాయగూరలు, ఆకు కూరలు పండించుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ విధానంపై పట్టణ ప్రజలను చైతన్యపరిస్తే రానున్న రోజుల్లో సాగు పెరిగే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన విభాగ విశ్రాంత డైరెక్టర్ సాన వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: గజపతి జిల్లా రాయఘడ బ్లాక్‌లోని డంబాపూర్ గ్రామంలో 100 మంది టీబీ రోగులకు నిత్యావసర సరుకులను జేఆర్ డవలప్‌మెంట్ ఫౌండేషన్, స్వాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ముఖ్యవైద్యాధికారి డాక్టర్ మమ్మద్ ముబారక్ అలీ, ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్, రాష్ట్ర కన్సల్టెంట్ శివప్రసాద్ హోత్తా, న్యాయవాది భాగ్యలక్ష్మీ నాయక్, స్వాస్ సంస్థ అధ్యక్షుడు డి.జగన్నాథ రాజు తదితరులు పాల్గొన్నారు.

వాహన తనిఖీలు



పెదబల్యాడి కూడలిలో తనిఖీలను నిర్వహిస్తున్న పోలీసులు

రాయగడ: రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా జిల్లా పోలీస్ యంత్రాంగం వాహన తనిఖీలను ముమ్మరం చేసింది. ఈ మేరకు సదరు పోలీసులు పట్టణంలోని ప్రధాన కూడళ్లలో సోమవారం తనిఖీలు చేపట్టారు. హెల్మెట్లు లేకుండా వాహనాలను నడిపే వారిపై జరిమానాలను విధించారు. అదేవిధంగా డ్రైవింగ్ లైసెన్సులు, నిర్ధారిత స్పీడ్ కంటే అతివేగంగా నడిపే వారిపై చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసులు తెలియజేశారు.

వినతుల స్వీకరణ



రాయగడ: మహిళకు ఆర్థిక సాయం అందజేస్తున్న కలెక్టర్ పట్వారీ



రాయగడ: సమస్యలు వింటున్న అధికారులు

రాయగడ: స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో కలెక్టర్ ఫరూల్ పట్వారీ, ఎస్పీ స్వాతి ఎస్.కుమార్‌లు వినతుల స్వీకరణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. సమితిలోని వివిధ ప్రాంతాలకు చెందిన 80 వినతులను స్వీకరించి అక్కడికక్కడే 21 వినతులను పరిష్కరించారు. మరో 63 వ్యక్తిగత వినతులను స్వీకరించిన అధికారులు వాటి పరిష్కారానికి సంబంధిత శాఖ అధికారులకు ఆదేశించారు. ఐదుగురికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.65 వేల ఆర్థిక సాయం అందజేశారు.

పర్లాకిమిడి: స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం గ్రీవెన్సు సెల్ నిర్వహించారు. జిల్లా పాలనాధికారి బిజయకుమార్ దాస్, ఎస్పీ జితేంద్ర కుమార్ పండా, జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్.ఆనంద్, డీఆర్‌డీఏ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి గుణనిధి నాయక్, అదనపు జిల్లా మేజిస్ట్రేట్ రాజేంద్ర మింజ్ ఇతర అధికారులు పాల్గొన్నారు. దీనిలో భాగంగా కత్తలకవిటి, పర్లాకిమిడి పురపాలక సంఘం, రాణిపేట, బాగుసల, సిద్ధమణుగు గ్రామ పంచాయతీల నుంచి ప్రజలు వినతులు అందజేశారు. మొత్తంగా 85 వినతులు కలెక్టర్‌కు అందగా, వాటిలో వ్యక్తిగతం 66 ఉన్నాయి.



పర్లాకిమిడి: వినతులు స్వీకరిస్తున్న అధికారులు

విస్తృతంగా ఎక్సైజ్ దాడులు




నాటుసారాతో నిందితులు



ఊటను స్వాధీనం చేసుకున్న దృశ్యం

రాయగడ: జిల్లాలో ఎక్సైజ్ శాఖ సోమవారం విస్తృతంగా దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో 8,400 లీటర్ల ఊట, 311 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని, 5 వ్యక్తులను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. ఎక్సైజ్ ఓసీ సంజయ్ ప్రధాన్ తెలిపిన వివరాల మేరకు.. జిల్లాలోని శిఖాల్ పోలీస్‌స్టేషన్ పరిధి బొడొ హలువ గ్రామంలో నిర్వహించిన దాడుల్లో 110 లీటర్ల సార, 4 వేల లీటర్ల ఊటను స్వాధీనం చేసుకోగా, అనిజ గ్రామంలో 84 లీటర్ల నాటుసార, 2200 లీటర్ల ఊట, కెరడలో 70 లీటర్ల సార, 1800 లీటర్ల ఊటను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా రాయగడ పోలీస్‌స్టేషన్ పరిధి కనకగు గ్రామంలో మరో 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

భారీగా గంజాయి పట్టివేత



గంజాయితో పట్టుబడిన వ్యాన్

కొరాపుట్: గంజాయి అక్రమ రవాణాని కొరాపుట్ జిల్లా పోలీసులు అడ్డుకున్నారు. సోమవారం వేకువజామున నందపూర్ ఎస్‌డీపీవో పరిధిలో పాడువ పోలీస్‌స్టేషన్ సమీపంలో హండిపుట్ జంక్షన్ వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించారు. అదే సమయంలో ఒక పికప్ వ్యాన్ వేగంగా వెళ్లడం గమనించి పోలీసులు అనుసరించారు. పోలీసులను చూసి వ్యాన్ ఆపినప్పటికీ అందులో ఉన్న స్మగ్లర్ తప్పించుకొని పరారయ్యాడు. వ్యాన్‌లో ఉన్న డ్రైవర్, హెల్పర్లను అదుపులోకి తీసుకున్నారు. అందులో 824 కేజీల గంజాయి పట్టుబడింది. దీని విలువ సుమారు రూ.8 లక్షలు ఉంటుందని పోలీసులు పేర్కొన్నారు.

పండగ కోసం ఇంటికి వస్తూ..

- రైలు నుంచి జారిపడి ఎస్ఎస్‌బీ జవాన్ మృతి
- నందిగాంలో విషాదఛాయలు



జగదీశ్వరరావు (ఫైల్)



విషాదంలో కుటుంబసభ్యులు

నందిగాం: దసరా పండగను భార్యాపిల్లలు, స్నేహితులతో కలిసి స్వగ్రామంలో జరుపుకుందామని సంతోషంగా బయలుదేరిన జవాన్‌ను మృత్యువు వెంటాడింది. కుటుంబ సభ్యులకు తీరని శోకం మిగిల్చింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. నందిగాంకు చెందిన గంటా జగదీశ్వరరావు(36) సశస్త్ర సీమా బల్(ఎస్ఎస్‌బీ)లో జనరల్ డ్యూటీ హెడ్ కానిస్టేబుల్‌గా బీహార్‌లోని జాయినగర్‌లో 48వ బెటాలియన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. భార్య శోభారాణి పిల్లలు జయవర్ధన్(12), చాందినీ(9)లను చదివిస్తూ శ్రీకాకుళంలో ఉంటున్నారు. దసరా పండగ కోసం జగదీశ్వరరావు 15 రోజులు సెలవు పెట్టి స్వగ్రామానికి బయలు దేరాడు. బీహార్ నుంచి హౌరా వచ్చి అక్కడి నుంచి ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌లో పలాసకు ఆదివారం ఉదయం బయలుదేరాడు. దౌల్తీ రైల్వేస్టేషన్ సమీపంలోకి వచ్చేసరికి వాంతులు రావడంతో రైలు డోర్ వద్ద ఉన్న వాష్‌బేసిన్ వద్దకు వచ్చాడు. ఇంతలో అదుపు తప్పి బయటకు తుళ్లిపడటంతో తలకు తీవ్రగాయాలై మృతి చెందాడు. తనతో పాటు ప్రయాణిస్తున్న 65వ బెటాలియన్‌కు చెందిన ప్రదీప్‌కుమార్ ఈ విషయాన్ని ఎస్ఎస్‌బీ బీహార్ యూనిట్ కంట్రోల్ రూమ్‌కు తెలియజేశాడు. దాంతో అక్కడి అధికారులు ప్రమాదం జరిగిన ప్రాంతానికి సమీపంలో ఉన్న ఎస్ఎస్‌బీ యూనిట్ 63వ బెటాలియన్‌కు సమాచారం అందించగా వారు ఉల్లుబెరియా రైల్వేపోలీస్‌స్టేషన్‌ను సంప్రదించి ఎస్ఐ సమీర్ ముఖర్జీ సహాయంతో జగదీశ్వరరావు మృతదేహానికి పోస్టుమార్టం చేయించారు. మృతదేహాన్ని కోల్‌కతా ఎయిర్‌పోర్టుకు, అక్కడి నుంచి విశాఖకు, తర్వాత రోడ్డు మార్గంలో నందిగాంకు చేర్చాల్సి ఉంది. సోమవారం మృతదేహం వస్తుందని చెప్పిన అధికారులు.. కోల్‌కతాలో దుర్గాపూజ నేపథ్యంలో ట్రాఫిక్ జామ్ కావడంతో సమయానికి చేరుకోకపోవడంతో విమానం తప్పిపోయారు. దీంతో మంగళవారం మధ్యాహ్నానికి మృతదేహం చేర్చిస్తామని కుటుంబసభ్యులకు సమాచారం అందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం పట్టణం నుంచి పొన్నాడకు బైక్‌పై వెళుతున్న పి.శ్యామలరావును నాగావళి నది వంతెన సమీపంలో సోమవారం ఎదురుగా వస్తున్న ఆటో ఢీ కొట్టింది. ఈ ఘటనలో గాయపడిన శ్యామలరావును 108 అంబులెన్సులో శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు. ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్యాపిల్లలు కనిపించడం లేదని ఫిర్యాదు

ఎచ్చెర్ల క్యాంపస్: ఈ నెల 5 నుంచి తన భార్యాపిల్లలు కనిపించడం లేదని పొన్నాడ గ్రామానికి చెందిన కరగాన అప్పలరాజు సోమవారం ఎచ్చెర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. కుమారులు ఢిల్లీశ్వరరావు, హేమంత్‌తో కలిసి భార్య మల్లీశ్వరి కన్నవారి ఇంటికి వెళ్లి ఉంటుందని భావించామని, అక్కడ ఆరా తీస్తే రాలేదని తెలిసిందని పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

వైద్య సమస్యలపై సమీక్ష సమావేశం



సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

కొరాపుట్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సాహిద్ లక్ష్మణ్ నాయక్ వైద్యశాలలో జిల్లాలోని వైద్య సమస్యలపై కలెక్టర్ వి.కీర్తి వాసన్ సమీక్ష సమావేశం సోమవారం నిర్వహించారు. ఖాళీగా వైద్య శాఖ పోస్టుల భర్తీ, అవసరమైన వైద్య పరికరాలు, ముందస్తుగా సీజనల్ వ్యాధుల సంరక్షణ చర్యలపై చర్చించారు.

సమావేశంలో కొరాపుట్ ఎంపీ ప్రతినిధి మనోజ్ ఆచార్య, జయపూర్ ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహిణీపతి, లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పవిత్ర శాంత, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సస్మితా మెలక తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రెండు వేల దరఖాస్తులు రావచ్చు

• ఎక్సైజ్ డీసీ బాబ్జీ రావు



బొబ్బిలి: ఉమ్మడి విజయనగరం జిల్లాలో ప్రైవేట్ మద్యం దుకాణాల కోసం 2వేల దరఖాస్తులు వస్తాయని అంచనా వేస్తున్నట్లు ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ ఎస్‌వీవీఎన్ బాబ్జీ రావు అన్నారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం ఇక్కడి మద్యం వ్యాపారులు, దరఖాస్తు దారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బొబ్బిలికి సంబంధించి ఇప్పటివరకూ 166 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. మద్యం వ్యాపారులంతా త్వరగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. చివరివరకూ చూస్తే నెట్ సాంకేతిక సమస్య వచ్చే పరిస్థితి ఉంటుందని ఆలస్యం చేస్తే ఇతర ప్రాంతాల నుంచి దరఖాస్తు చేయిస్తామని చెప్పారు. లైసెన్స్ ఫీజులను 6 వాయిదాల్లో చెల్లించవచ్చని పేర్కొన్నారు. జిల్లాలోని జనాభా ప్రాతిపదికన, ప్రాంతాల వారీగా రూ.65లక్షల వరకూ ఫీజు సొమ్ము ఉందని, రెండో ఏడాదికి 10 శాతం అదనంగా చెల్లించాల్సి ఉందన్నారు. మద్యం దుకాణ దారుడు ఏ ప్రాంతంలో అయితే ఆ ప్రాంతంలోనే తనకు నచ్చిన చోట షాపు పెట్టుకోవచ్చన్నారు. కానిస్టేబుల్స్‌కు ప్రమోషన్ వచ్చిన తరువాత వారి సంఖ్య తగ్గిందని, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ బ్రాండ్ల కంపెనీల వారు కూడా వంద రూపాయలకు ఓ క్వార్టర్ విక్రయించేలా ఒప్పందాలు జరిగాయని, వివిధ రాష్ట్రాల్లో అధ్యయనం చేసి కొత్త షాపుల విధానం రూపొందించినట్లు చెప్పారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కనిపించడం లేదని మద్యం వ్యాపారులు ప్రశ్నించగా కొన్ని చోట్ల ఇబ్బందులు వస్తున్నాయని నిలిపివేసినట్లు చెప్పారు. త్వరలో కనిపించే పరిస్థితి వస్తుందన్నారు.

అంతుచిక్కని వ్యాధితో 50 గొర్రెల మృతి



వివరాలు వెల్లడిస్తున్న రైతు

రేగిడి: మండలంలోని వావిలవలస గ్రామంలో అంతుచిక్కని వ్యాధితో గొర్రెలు మృతిచెందుతున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన కొయ్యాన రామకృష్ణ, చీమల వెంకటి తదితర రైతులకు చెందిన 50 గొర్రెలు, మేకలు మూడు రోజుల వ్యవధిలో మృతిచెందాయి. దీంతో బాధిత రైతులు సోమవారం గ్రామ పరిధిలోని పశుసంవర్ధకశాఖ కార్యాలయానికి చేరుకుని మొరపెట్టుకున్నారు. గొర్రెల పెంపకం ద్వారా జీవనం సాగిస్తున్నామని, ఇటీవల మూగజీవాలు మృతిచెందడంతో పాటు వాటికి ఇన్సూరెన్స్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఈ జీవాల కండ్లకు పొరలు రావడం, పారుడు వ్యాధి సోకినట్లు వచ్చి ఆకస్మికంగా మృతిచెందినట్లు తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య

బొబ్బిలి: పట్టణంలోని దేవాంగుల వీధికి చెందిన నారంశెట్టి మృత్యుంజయరావు(70) బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. అనారోగ్య కారణాలతో మందులు వాడుతున్నా తగ్గకపోవడంతో మనస్తాపం చెంది సోమవారం ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడి కుమారుడు రామచంద్రమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేష్ తెలిపారు.

480 బస్తాల పీడీఎస్ బియ్యం పట్టివేత

గరుగుబిల్లి: మండలంలోని గొల్ల వానివలస గ్రామ రెవెన్యూ పరిధిలో గల గొడౌన్‌లో అక్రమంగా నిల్వచేసిన 480 బస్తాల్లోని (ఒక్కొక్క బస్తా 50 కిలోలు) దాదాపు 2400 కిలోలు పీడీఎస్ బియ్యం తరలిస్తుండగా ఆదివారం అర్ధరాత్రి సీజ్ చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ఎన్.ఈశ్వరరావు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా అక్రమంగా పీడీఎస్ బియ్యం నిల్వచేసిన మహమ్మద్ ఇర్ఫాన్, ఆటో డ్రైవర్‌లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం స్థానిక తహసీల్దార్ పి.బాలకు సమాచారం అందించామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ ఎం.కృష్ణ, వీఆర్‌ఓ కరుణ కుమార్ తదితరులు పాల్గొన్నారు. సీజ్ చేసిన గొడౌన్‌కు సంబంధించి తాళాలను వీఆర్‌ఓ కరుణకుమార్‌కు అప్పగించినట్లు హెచ్‌సీ ఈశ్వరరావు తెలిపారు. ఈ దాడుల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరంలో 105 బస్తాలు

సీతానగరం: శ్రీకాకుళం రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి బర్ల ప్రసాదరావుకు వచ్చిన సమాచారం మేరకు 7టన్నుల 700 కేజీల పీడీఎస్ బియ్యాన్ని సీతానగరం మండలంలోని వివిధగ్రామాల్లో సోమవారం సోదాలు చేసి పట్టుకున్నట్లు సీఎస్‌డీటీ రమేష్‌బాబు తెలియజేశారు. ఈ దాడుల్లో బి.సింహాచలం సీఐ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

దసరా సంత

సీతంపేట: సీతంపేటలో సోమవారం జరిగిన వారపు సంత క్రయవిక్రయదారులతో రద్దీగా మారింది. ఈ నెల 12న దసరా కావడం... దసరాకు ముందు వారపు సంత కావడంతో పొట్టేళ్లు, మేకలు, నాటుకోళ్ల కొనుగోలుకు పెద్దసంఖ్యలో మైదాన ప్రాంతాల నుంచి సంతకు తరలివచ్చారు. గిరిజనులు తమ ఉత్పత్తులు విక్రయించి, వారికి కావాల్సిన నిత్యావసర సరుకులు కొనుగోలు చేశారు.

ఎవరి స్థాయి ఎంతో..!

• విద్యార్థుల సామర్థ్యానికి మదింపు
• 3,6,9 తరగతి విద్యార్థుల ప్రతిభకు గుర్తింపు పరీక్ష
• (నాస్) పరీక్షలకు రంగం సిద్ధం



బోధనలో నిమగ్నమైన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

పాలకొండ రూరల్: పిల్లల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలనే సమున్నత లక్ష్యంతో విద్యావ్యవస్థలో నిరంతర కసరత్తు జరుగుతోంది. ఇందులో భాగంగా. సగటు విద్యార్థి తరగతి వారీగా అభ్యసన సామర్థ్యాలు సాధించేలా ఎప్పటికప్పుడు సరికొత్త సంస్కరణలు తీసుకువస్తున్నారు. బడి బాటపడుతున్న పిల్లల్లో అభ్యసన సామర్థ్యాలు ఎలా ఉన్నాయో తెలుసుకునేందుకు కేంద్రప్రభుత్వం నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (ఎన్ఏఎస్) నిర్వహించేలా క్షేత్రస్థాయిలో కసరత్తు చేపట్టింది. ప్రతి మూడేళ్లకు ఒకసారి నాస్ సర్వే నిర్వహిస్తోంది. 2021లో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ ఏడాది రాష్ట్ర పాఠశాలల విద్యాశాఖ, సమగ్రశిక్ష, ఎస్‌సీఈఆర్‌టీల నేతృత్వంలో సర్వే నిర్వహించ నున్నారు. నాస్ సర్వేకు ముందుగా స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే మండలస్థాయిలో చేపట్టనున్నారు. ఈ సర్వే ప్రస్తుత ఏడాది నవంబర్ 19న దేశ వ్యాప్తంగా నిర్వహిస్తారు. దీని ఆధారంగా పిల్లల విద్యా ప్రమాణాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకోవచ్చు. అదే సమయంలో ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యాన్ని కూడా అంచనా వేసేందుకు ఉపయోగపడుతుంది. మూడేళ్లకు ఒకసారి చేపట్టే సర్వే ఆధారంగా విద్యా వ్యవస్థలో అవసరమైన సంస్కరణలు తీసుకువచ్చే వెసులుబాటు కలుగుతుంది.

ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ల ఎంపికకు కసరత్తు..

నాస్ సర్వేలో భాగంగా క్షేత్రస్థాయిలో పరీక్ష నిర్వహించేందుకు ఆయా మండలాలకు ఎంతమంది ఎఫ్ఐలు అవసరమనేది విద్యాశాఖ నిర్ధారణకు వస్తుంది. అనంతరం ఎఫ్ఐలుగా ఛాత్రోపాధ్యాయులు, విద్యార్థులను నియమించి వారికి శిక్షణ అందిస్తారు. సర్వే నిమిత్తం నిర్వహించే పరీక్ష వారి పర్యవేక్షణలోనే జరుగుతుంది. జిల్లా విద్యాశాఖాధికారి పర్యవేక్షణలో డీసీఈబీ సెక్రటరీ, సమగ్ర శిక్ష ఏఎంఎ, డైట్ ప్రిన్సిపాల్/లెక్చరర్, డీఈఓ కార్యాలయ ప్రతినిధి, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ ఈపరీక్షల నిర్వహణ ప్రక్రియను పరిశీలిస్తారు. మండల స్థాయిలో పరీక్షల నిర్వాహకులుగా ఎంఈఓ1, 2తో పాటు స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు వ్యవహరిస్తారు. ఈ పరీక్షకు ముందుగా విద్యార్థులకు ఎస్‌సీఈఆర్టీ అధ్వర్యంలో ప్రాక్టీస్ పరీక్షల ద్వారా ఉపాధ్యాయులు సన్నద్ధం చేయాల్సి ఉంటుంది. గతంలో 3, 5, 8 తరగతులకు ఈ పరీక్షలు చేపట్టగా ఈ ఏడాది నాస్ సర్వేలో 3, 6, 9 తరగతుల విద్యార్థులకు పరీక్షలు నిర్వహించ నున్నారు. ఎస్‌సీఈఆర్‌టీ నుంచి ఎంపిక చేసిన పాఠశాలల్లోనే ఈ పరీక్షలు నిర్వహిస్తారు. వీటి నిర్వహణకు ఎస్‌సీఈఆర్‌టీ ముందుగా సరఫరా చేసిన ప్రాక్టీస్ పేపర్ల ద్వారా తర్ఫీదు అందిస్తారు. తద్వారా ఈ పరీక్షలను సమర్థవంతంగా ఎదుర్కొనే అవకాశం ఉంటుంది. పూర్తి ఓఎంఆర్ విధానంలో పరీక్ష ఉంటుంది. 3, 6 తరగతుల విద్యార్థులకు తెలుగు/ ఇంగ్లీష్, గణితం, పరిసరాల విజ్ఞానం, 9వ తరగతి విద్యార్థులకు తెలుగు/ఇంగ్లీష్, గణితం, సోషల్, సైన్స్ సబ్జెక్టులపై పరీక్షలు నిర్వహిస్తారు.

అవగాహన శక్తి అంచనా కోసం



విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల మదింపు, అవగాహన శక్తిని అంచనా వేసేందుకు ఈ సర్వే ఎంతగానో ఉపకరిస్తుంది. వీటి ఫలితాలను అనుసరించి బోధనాభ్యసన ప్రణాళికలను రూపొందిస్తారు. సర్వేలో భాగంగా విద్యార్థులకు నిర్వహించే పరీక్షలకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం. సర్వేను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఆదేశాలు జారీ చేశాం. ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ల (ఎఫ్ఎఐ) నియామకానికి చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు ఈ పరీక్షలకు సిద్ధం చేసేందుకు ముమ్మర కసరత్తు చేపడుతున్నాం .ఈ ప్రక్రియను జిల్లా కమిటీ పర్యవేక్షిస్తుంది.

– జి.పగడాలమ్మ, డీఈఓ, పార్వతీపురం మన్యం

సర్వేలో ముఖ్యాంశాలు..

ఎంపిక చేసిన ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్య పాఠశాలల్లో సర్వే నిర్వహిస్తారు. 3,6,9 తరగతుల విద్యార్థులకు ఈ పరీక్ష ఉంటుంది. 3వ తరగతి విద్యార్థులకు అదే తరగతికి సంబంధించిన సిలబస్, 6వ తరగతి విద్యార్థులకు 5వ తరగతికి సంబంధించిన సిలబస్, 9వ తరగతి విద్యార్థులకు 8వ తరగతి సిలబస్‌పై పరీక్ష ఉంటుంది. 3,6 తరగతుల విద్యార్థులకు లాంగ్వేజ్, గణితం, ఈవీఎస్, 9వ తరగతి విద్యార్థులకు లాంగ్వేజ్, గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్టుపై నిర్వహించనున్న పరీక్షలు 3,6 తరగతుల విద్యార్థులు 40 ప్రశ్నలకు 60 నిమిషాల సమయం, 9వ తరగతి విద్యార్థులు 60 ప్రశ్నలకు 90 నిమిషాల వ్యవధిలో సమాధానాలు రాసేందుకు సమయం కేటాయిస్తారు. జిల్లాలో 552 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులను గుర్తించేందుకు అభ్యసన ఫలితాలు లెర్నింగ్ అవుట్ కమ్స్‌పేరిట సర్వే చేపట్టనున్నారు. ఈ క్రమంలో నిర్వహించనున్న పరీక్షల ద్వారా సామర్థ్యాల మదింపు చే పడతారు. పరీక్షల నిర్వహణకు ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లు (ఎఫ్ఐ)లుగా డైట్, బీఎడ్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీవిద్యాభ్యాసం సాగిస్తున్న వారిని ఎంపిక చేస్తారు. వారికి జిల్లాస్థాయి కోఆర్డినేటర్ల ద్వారా శిక్షణ అందిస్తారు. ప్రతి శనివారం అన్ని యాజమాన్య పాఠశాలల్లో ప్రత్యేక ప్రాక్టిస్ పరీక్షలు చేపట్టి విద్యార్థులను సిద్ధం చేయాల్సి ఉంటుంది.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



బాలకృష్ణ మృతదేహం

పార్వతీపురం టౌన్: పట్టణంలోని బెలగాం రైల్వే గేట్ సమీపంలో సోమవారం రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి జీఆర్‌పీ అవుట్‌పోస్టు సిబ్బంది తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గరుగుబిల్లి మండలం ఉద్దవోలు గ్రామానికి చెందిన తూముల బాలకృష్ణ(37) రైల్వేగేట్ సమీపంలో హోం సిగ్నల్ వద్ద డౌన్‌లైన్ ట్రాక్ దాటుతుండగా విశాఖపట్నం నుంచి రాయపూర్ వెళ్తున్న పాసింజర్ రైలు ఢీకొట్టడంతో ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

పిడుగు పడి మహిళ..

గజపతినగరం: మండలంలోని కొత్త శ్రీరంగరాజపురం గ్రామానికి చెందిన మహిళ పిడుగు పడి మృతి చెందింది. సోమవారం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బూడిఅప్పలమ్మ(65సంవత్సరాలు) తమ పొలంలో పండిస్తున్న పత్తి పంట పనుల కోసం మెరక బంద పొలానికి ఆరుగురు కూలీలను తీసుకుని వెళ్లింది. ఇంతలో మధ్యాహ్నం సమయంలో ఉరుములు, మెరుపులు, పిడుగులతో భారీ వర్షం కురిసింది. పత్తి పనుల అనంతరం మధ్యాహ్నం విరామ సమయంలో బూడి అప్పలమ్మతో పాటు కూలిపనికి వచ్చిన వారు ఒక చోట చేరుకుంటున్న సమయంలో ఒక్కసారిగా పిడుగు పడింది. పిడుగు పడిన చెంతనే ఉన్న అప్పలమ్మ అక్కడికక్కడే మృతి చెందగా మిగతా ఆరుగురు మహిళలు షాక్‌కు గురయ్యారు. వెంటనే అప్పలమ్మతో పాటు మిగతా ఆరుగురు మహిళలను గజపతినగరం ఏరియా ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి సేవలు అందించారు. మృతురాలు అప్పలమ్మ భర్త చనిపోగా ఇద్దరు కుమారులు శ్రీను, అప్పలనాయుడు ఉన్నారు.



పిడుగుపాటుకు గురై మృతి చెందిన అప్పలమ్మ

సూపర్ మార్కెట్‌లో చోరీకి విఫలయత్నం



సూపర్‌మార్కెట్ వద్ద చోరీకి ప్రయత్నిస్తున్న యువకులు

రాజాం/సంతకవిటి: సంతకవిటి మండలంలోని గుళ్లసీతారాంపురం గ్రామంలో శ్రీ రాజ్యలక్ష్మి సూపర్‌మార్కెట్‌లో ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత దొంగలు చోరీకి విఫలయత్నం చేశారు. షాపు నలువైపులా తిరిగి లోనికి చొరబడేందుకు ముగ్గురు యువకులు ప్రయత్నించారు. ఎటువంటి అవకాశం లేకపోవడంతో పాటు చుట్టూ సీసీ కెమెరాలు ఉండడంతో కంగుతిని అక్కడి నుంచి ఉడాయించారు. సోమవారం ఉదయం సీసీ కెమెరాల్లో ఈ విషయాన్ని గుర్తించిన షాపు యజమాని సంతకవిటి పోలీసులకు ఫిర్యాదుచేసి, సీసీ కెమెరా ఫుటేజ్‌లు అందించారు. ఈ మేరకు ఎస్సై ఆర్. గోపాలరావు సోమవారం గుళ్లసీతారాంపురం గ్రామానికి చేరుకుని చోరీకి యువకులు యత్నించిన షాపు వద్ద ఆరా తీశారు. దొంగలను పట్టుకునేందుకు ప్రయత్నం ముమ్మరం చేశారు.

వినతులిచ్చిన రోజే పరిష్కారం

• జేసీ సేతుమాధవన్
• ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 161 వినతులు



వినతులను స్వీకరిస్తున్న జేసీ సేతు మాధవన్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం అర్బన్: ప్రజాఫిర్యాదుల విభాగానికి వచ్చిన వినతులకు నాణ్యమైన, కచ్చితమైన సమాధానాలు ఇవ్వాలని, రీ ఓపెన్ చేసే పరిస్థితి లేకుండా చూడాలని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ అన్నారు. వినతులు వచ్చిన రోజే అధికారులు ఓపెన్ చేయాలని, ఎక్కువగా రెవెన్యూకు చెందిన వినతులే వస్తున్నాయని, తహసీల్దార్లు ఈ విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా వినతుల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.డి.అనిత ప్రజలనుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 161 అర్జీలు అందగా, భూ సమస్యలకు సంబంధించి రెవెన్యూ శాఖకు అత్యధికంగా 102, వినతులు అందాయి. పింఛన్లు మంజూరు చేయాలని తదితర అంశాలపై డీఆర్‌డీఏకు 25 వినతులు అందాయి. మున్సిపాలిటీకి 14, పంచాయతీ రాజ్ శాఖకు 6, విద్యాశాఖకు 4 అందగా, డీపీఓకు 10, వైద్యశాఖకు 4 వినతులు అందాయి. మిగిలినవి ఇతర శాఖలకు చెందినవి ఉన్నాయి.

ఎస్పీ గ్రీవెన్స్‌సెల్‌కు 48 ఫిర్యాదులు

విజయనగరం క్రైమ్: ప్రజల సమస్యల తక్షణ పరిష్కారానికి 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' ఎంతగానో ఉపయోగపడుతుందని ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి 48 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా బాధితుల సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యల పరిష్కారానికి చట్టపరిధిలో చర్యలు చేపట్టి, న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. తీసుకున్న చర్యల వివరాలను జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎస్పీ సీబ ఎ.లీలారావు, ఆర్‌వీఆర్‌కే. చౌదరి, డీసీఆర్‌బీ ఎస్సై రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



సీతంపేట: వినతిపత్రం ఇస్తున్న గిరిజనులు

ప్రత్యేక పింఛన్ మంజూరు చేయాలి

పార్వతీపురం: సీతానగరం మండలం అప్పయ్యపేటకు చెందిన రెడ్డి విజయ్‌కుమార్ 90శాతం వికలాంగత్వంతో బాధపడుతున్నాడు. ప్రభుత్వం ప్రతి నెలా రూ.6వేల పింఛన్ ఇస్తోంది. ఈ పింఛన్‌తో కుటుంబాన్ని పోషించేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. పూర్తిగా వికలాంగత్వం ఉండడంతో కాళ్లు చచ్చుబడి మంచానికే పరిమితమయ్యాను. పింఛన్ మినహా ఎలాంటి ఆధారం లేదు. అధికారులు స్పందించి ప్రత్యేక పింఛన్‌ను మంజూరు చేయాలని కోరాడు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు తన తండ్రి సహాయంతో వచ్చి వినతిపత్రం అందజేశాడు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 105 వినతులు వచ్చినట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. కలెక్టర్‌తో పాటు ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ, డీఆర్‌ఓ జి.కేశవనాయుడులు వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యలకు నాణ్యమైన పరిష్కారం చూపేలా అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఐటీడీఏ గ్రీవెన్స్ సెల్‌కు 42 వినతులు

సీతంపేట: ఐటీడీఏలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 42 వినతులు వచ్చాయి. చిగురువలసకు చెందిన అమ్మన్న రహదారి మంజూరు చేయాలని, పాఠశాల భవనం మంజూరు చేయాలని జల్లారకు చెందిన విశ్వనాథం కోరారు. జగ్గదుగూడకు మంచినీటి సదుపాయం కల్పించాలని గ్రామస్తులు వినతిపత్రం ఇచ్చారు. సీతంపేటలో బంగారు బండి చెరువు ఆక్రమణలు తొలగించి చెరువు నిర్మించాలని గోండ్వానా దండకారణ్య పార్టీ అధ్యక్షుడు బి.రామారావుతో పాటు పలువురు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీవో చిన్నబాబు, గిరిజన సంక్షేమశాఖ డీడీ అన్నదొర, పీహెచ్‌వో ఎస్‌వీ గణేష్, ఏటీడబ్ల్యూవో మంగవేణి, సీడీపీవో రంగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీల విజేత సంతోష్



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

విజయనగరం: రాష్ట్రస్థాయిలో నిర్వహించిన చెస్ పోటీల్లో కాకినాడకు చెందిన ఎం.జ్ఞానసాయి సంతోష్ విజేతగా నిలిచాడు. ద్వితీయస్థానంలో విశాఖకు చెందిన ఎం.వెంకట రిత్విక్, తృతీయ స్థానంలో ఎస్.వరహాలు నిలిచారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ఆంధ్రచెస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.సురేష్, కార్యదర్శి కె.జగదీష్, కోశాధికారి కేకే.జగన్నాథం బహుమతులు ప్రదానం చేశారు. చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం ఆధ్వర్యంలో స్థానిక రెవెన్యూ హోంలో రెండు రోజుల పాటు నిర్వహించిన పోటీల్లో వివిధ జిల్లాలకు చెందిన 250మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వారికి చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం కార్యదర్శి కేవీ.జ్వాలాముఖి ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించగా..కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, ఎంవి.కృష్ణాజీలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పతకాల పంట

• 20 పతకాలు దక్కించుకున్న జిల్లా క్రీడాకారులు



రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా అథ్లెట్‌లు సత్తా చాటారు. జూనియర్స్ విభాగంలో జరిగిన ఈ పోటీల్లో పతకాల పంట పండించారు. ఈనెల 4,5,6 తేదీల్లో రాజమండ్రిలోని ఆర్ట్స్ కళాశాలలో జరిగిన అంతర్ జిల్లాల బాల,బాలికల జూనియర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన పలువురు క్రీడాకారులు మొత్తం 20 పతకాలు సాధించగా..అందులో బంగారు పతకాలు11, వెండి పతకాలు 6, కాంస్య పతకాలు 3 ఉన్నాయి. రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా కీర్తి ప్రతిష్ఠలను చాటి చెప్పిన క్రీడాకారులు, కోచ్‌లు పి.సతీష్, వై.మధు, పి.శేఖర్, ఎ.లక్ష్మణ్‌లను ఏపీ అథ్లెటిక్స్ అసోసియేషన్ సీఈఓ ఎ.హైమ, కార్యదర్శి గౌతమ్‌కుమార్, సెలక్షన్ కమిటీ చైర్మన్ నారాయణరావు, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు జీసీఎస్ఆర్ విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

రాజాం సిటీ: స్థానిక జీసీఎస్ఆర్ కళాశాల విద్యార్థులు త్వరలో రాష్ట్రస్థాయిలో జరగనున్న పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యారని పీడీ సీహెచ్.కేశవ నారాయణ సోమవారం తెలిపారు. ఈ నెల 1న ఎచ్చెర్లలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో బి.దీక్షిత, జి.గోపీచంద్, జి.చరణ్‌రామ్‌సాయిలు చక్కని ప్రతిభ కనబరిచారని తెలిపారు. త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వారు పాల్గొంటారని వెల్లడించారు. రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపికపట్ల అధ్యాపకులు జి.రాంబాబు, కె.శ్రీనివాసరావు తదితరులు హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థులను అభినందించారు.

భవనంపై నుంచి పడి పెయింటర్ మృతి

• మృతిపై అనుమానాలున్నాయని భార్య ఫిర్యాదు



పెయింటర్ గణేష్ మృతదేహం

శృంగవరపుకోట: పట్టణంలోని ఓ నిర్మాణ భవనంపై నుంచి పడి మారేడిపల్లి గణేష్ (35) అనే పెయింటర్ మృతి చెందినట్లు ఎస్సై గంగరాజు సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వేపాడ మండలం, పెద్ద గుడిపాల గ్రామానికి చెందిన మారేడి పల్లి గణేష్ పెయింటింగ్ వృత్తి చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అందులో భాగంగా ఎస్.కోట కాలేజీ గ్రౌండ్ ఎదురుగా ఉన్న నూతన భవనానికి వారం రోజులుగా ముగ్గురు పెయింటర్లు పెయింట్ వేస్తూ అక్కడే ఉంటున్నారు. ఆదివారం రాత్రి ఎప్పటిలాగే భోజనం చేసి పడుకున్నారు. తెలవారు జామున చూసేసరికి గణేష్ లిఫ్ట్ ఏర్పాటు కోసం విడిచిన స్థలం పైనుంచి కిందపడి చనిపోయి ఉంటాడని, గణేష్ మృతిపై అనుమానాలు ఉన్నాయని భార్య సంతోషి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై గంగరాజు తెలిపారు.

నాకేం తక్కువ..?

• నాకూ మద్యం షాపు కావాలి
• దరఖాస్తు చేయడానికి వచ్చిన 85ఏళ్ల బామ్మ
• ఆశ్చర్యపోయిన ఎక్సైజ్ అధికారులు



ఎక్సైజ్ కార్యాలయంలో 85 ఏళ్ల బామ్మ

బొబ్బిలి: ఆకలిగొన్న పులుల్లా మద్యం షాపు దక్కించుకోవడానికి అర్రులు చాస్తున్న సిండికేట్ వ్యాపారుల మధ్యలోని ఓ బామ్మ వచ్చి తనకూ మద్యం షాపు కావాలంటూ దరఖాస్తు చేసి అందరికీ షాక్ ఇచ్చింది. మద్యం షాపు కోసం దరఖాస్తు చేయడానికి కార్యాలయానికి వచ్చిన ఓ వృద్ధురాలిని చూసిన ఎక్సైజ్ అధికారులు ముసిముసి నవ్వులు నవ్వుతూ ముక్కున వేలేసుకున్నారు. బొబ్బిలి ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో టెండర్ బాక్స్‌లో ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసేందుకు ఓ బామ్మ వచ్చి అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. దత్తిరాజేరు మండలం పి.లింగాలవలసకు చెందిన పప్పల అచ్చయ్యమ్మ(85) ఎక్సైజ్ అధికారులు నిర్వహిస్తున్న సమావేశాలకు హాజరవుతూ అందరినీ ఆలోచనలో పడేస్తోంది. బొబ్బిలి కార్యాలయానికి సోమవారం సాయంత్రం వచ్చిన ఆ బామ్మకు ఓ బల్ల ఇచ్చి స్నాక్స్ ఇచ్చి ఎక్సైజ్ అధికారులు కూడా మర్యాద చేయడం విశేషం.

వైభవాన్ని చాటిచెప్పేలా ఉత్సవాలు

• మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు



హుకుంపేటలో సిరిమాను సిద్ధం చేస్తున్న వారితో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి, ఎమ్మెల్యే అదితి

విజయనగరం టౌన్: విజయనగర వైభవాన్ని, సంస్కృతిని చాటిచెప్పే విధంగా ఉత్సవాలను నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్‌తో కలిసి సోమవారం ఆయన పట్టణంలోని ఉత్సవ వేదికలను పరిశీలించారు. మంత్రి ముందుగా శ్రీ పైడితల్లి అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. ఆయనకు ఆలయ పూజారులు, అధికారులు లాంఛనాలతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ ప్రాంగణాన్ని , క్యూలను మంత్రి పరిశీలించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని ఆలయ అధికారులను ఆదేశించి పూజారులతో చర్చించారు. సిరిమానును అమ్మవారి ఆలయం దగ్గరికి వీలైనంత వేగంగా తరలించాలని కోరారు. ఇరుసుమాను, రథాలను కూడా మంత్రి పరిశీలించారు. అనంతరం మెగా ఈవెంట్ జరిగే అయోధ్య మైదానానికి చేరుకున్నారు. 13, 14 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించే మెగా ఈవెంట్‌పై, సంబంధిత వేదికల ఇన్‌చార్జ్‌లతో చర్చించారు. ఈవెంట్‌కు భారీ ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ పర్యటనలో జేసీ ఎస్.సేతుమాధవన్, డీఆర్‌ఓ ఎస్.డి అనిత, ఉత్సవాల ప్రత్యేకాధికారి త్రినాథరావు, ఆర్‌డీఓ డి.కీర్తి, ఈఓ డీవీవీ.ప్రసాదరావు, మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య, డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి, ఆర్అండ్‌బీ ఎస్ఈ కాంతిమతి, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ లక్ష్మణరావు, సీపీఓ పి.బాలాజీ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సుధారాణి, మెప్మా పీడీ శ్రీనివాసరావు, డీఎస్‌ఓ వెంకటేశ్వరరావు, ఆలయ పూజారి బంటుపల్లి వెంకటరావు, ఐవీపీ రాజు తదితరులు పాల్గొన్నారు.

కురుపాంలో మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు



కురుపాం కోర్టు ఆవరణలో మహిళ న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్న ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జె.సౌమ్య జాస్పిన్

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండల కేంద్రంలోని ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మహిళా న్యాయ విజ్ఞాన సదస్సును సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్, జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జె.సౌమ్య జాస్పిన్ మాట్లాడుతూ మహిళలకు జరుగుతున్న అన్యాయాలు, అరాచకాలు, లైంగిక వేధింపులు, చిన్నారులపై జరుగుతున్న లైంగిక దాడుల్లో చట్టాలు కల్పిస్తున్న రక్షణ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యవస్థల గురించి తెలియజేశారు. ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగుల పట్ల చూపుతున్న లింగవివక్ష నివారణకు చట్టపరిధిలో తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. మహిళలకు ఏవైనా సమస్యలుంటే న్యాయ సేవ సంస్థను సంప్రదిస్తే న్యాయ సలహాలు, సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. మహిళల చట్టాలు, వారికున్న రక్షణపై అవగాహన పెంపొందించేందుకు సదస్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.అనంతరం రిసోర్స్ పర్సన్లు పీవీ వరలక్ష్మి, ఏవీఎల్ పద్మజలు కూడా పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పారాలీగల్ వలంటీర్లు అంధవరపు కోటేశ్వరరావు, ఎం .మహేశ్వరి, బి.విజయలక్ష్మి, సామల రాజేష్, మేఘాలయ, వెంకటరావులతో పాటు వలంటీర్లు పాలకొల్లు శ్రీనివాస్, మంగరాజు ఉన్నారు.